క్లుప్తంగా

రెజ్లర్లకు న్యాయం చేయాలి

నెల్లూరు (వేదాయపాళెం): ఢిల్లీలో పోరాటం చేస్తున్న రెజ్లర్లకు న్యాయం చేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్‌బీ పేర్కొన్నారు. రెజ్లర్లకు మద్దతుగా బాలాజీనగర్‌లోని రామచంద్రారెడ్డి భవన్‌లో విలేకరుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ, ఆవాజ్ జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు, రమణ, రషీద్, ఐద్వా నగరాధ్యక్ష, కార్యదర్శులు సుబ్బమ్మ, పద్మ, నేతలు కోటేశ్వరరావు, శ్రీనివాసులు, నరేంద్ర, రియాజ్, రవూఫ్, తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాల అందజేత



నెల్లూరు (పొగతోట): జెడ్పీలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబసభ్యులకు ఉద్యోగావకాశాలు కల్పించారు. దీనికి సంబంధించిన నియామక ఉత్తర్వులను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ శుక్రవారం అందజేశారు. జెడ్పీ సీఈఓ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశం

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాన్ని డీసీసీబీ మాజీ చైర్మన్, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి శుక్రవారం నిర్వహించారు. నగరంలోని తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు రూరల్: ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో కమిషనర్ వికాస్ మర్మత్ మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఉస్మాన్‌సాహెబ్‌పేటలో రథోత్సవాన్ని శనివారం నిర్వహించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని స్టోన్‌హౌస్‌పేట ఏఈ సుకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ లేఅవుట్, రేబాలవారివీధి, ఉస్మాన్‌సాహెబ్‌పేట, ప్రకాష్‌నగర్, పప్పులవీధి, స్టోన్‌హౌస్‌పేట మెయిన్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు సరఫరా ఉండదని చెప్పారు.

- జగదీష్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ రామాలయం ఫీడర్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో బాలాజీనగర్, ఏసీనగర్, గౌడ హాస్టల్ సెంటర్, రామాలయం, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫ రా ఉండదని ఈస్ట్–2 ఏఈ ప్రసాద్‌రావు పేర్కొన్నారు.
- రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్లో స్కాడా పనులను చేపట్టనున్న నేపథ్యంలో మహేశ్వరినగర్, శివగిరికాలనీ, వాకర్స్ రోడ్డు, రాజీవ్ గృహకల్ప, న్యూ పోలీస్ కాలనీ, మస్తానమ్మ లేఅవుట్, ములుమూడి బస్టాండ్, గుప్తా పార్క్, పాత మున్సిపల్ కార్యాలయం, తదితర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని వెస్ట్ – 2 ఏఈ గోపీ పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని 14వ డివిజన్ కార్పొరేటర్ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. డివిజన్ వాసుల సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో చేపట్టిన ఉషోదయాన వీధి వీధికీ మీ కర్తం కార్యక్రమం శుక్రవారంతో 11వ రోజుకు చేరింది. బాలాజీనగర్, ఏసీనగర్, గిరిజన సంఘం, తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్యాన్ని పరిశీలించారు.

పరిహారం చెల్లించాలంటూ నిరసన



నెల్లూరు రూరల్: కొమ్మరపూడి రైతుల నుంచి సేకరించిన భూములకు నష్టపరిహారాన్ని అందించడంలో జాప్యం జరుగుతోందని, సత్వరమే చెల్లించాలంటూ పలువురు రైతులు కోరారు. ఈ మేరకు దొంతాలి క్రాస్‌రోడ్డు వద్ద నెల్లూరు – పొదలకూరు రోడ్డుపై కొద్దిసేపు నిరసనను శుక్రవారం చేపట్టారు. ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు. వేదాయపాళెం పోలీస్‌స్టేషన్ సిబ్బంది అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు..

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్



సమస్యలను ఆరాతీస్తున్న అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 11వ డివిజన్లో గల చెరుకుతోటలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారికి వర్తించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజా సమస్యలను తెలుసుకుంటున్నామని చెప్పారు. సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. చెరుకుతోటలో పార్కు అభివృద్ధికి రూ.30 లక్షలతో టెండర్లు పిలిచామని, ఈ నెల 15న శంకుస్థాపనను చేపట్టనున్నామని చెప్పారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్లు, నేతలు, కార్యకర్తలు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరిస్తున్నారని తెలిపారు. టీడీపీ నేతలు ప్రెస్‌మీట్లకే పరిమితమవుతున్నారని విమర్శించారు. టీడీపీ నేతలు పిల్ల కాలువల వద్ద సెల్ఫీలు తీసుకొని అభివృద్ధి జరగలేదంటూ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. గత ప్రభుత్వంలో చేసిన నాసిరకమైన పనుల ముందు సెల్ఫీలు తీసుకుంటే ఫేస్‌బుక్‌లో పేజీలు సైతం సరిపోవని విమర్శించారు. కార్పొరేటర్ అరుణ, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం నరసింహుని గరుడోత్సవం



నెల్లూరు రూరల్: వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలను శుక్రవారం నిర్వహించారు. మోహినీ ఉత్సవం, అఖండజ్యోతి, మూలవర్లకు పూలంగి సేవ, బంగారు గరుడసేవను భక్తిశ్రద్ధలతో జరిపారు. నరసింహకొండ సమీపంలోని ములుమూడి నుంచి వేదగిరికి మోహినీ ఉత్సవం చేరుకుంది. బంగారు గరుడ వాహనంపై స్వామివారు ఊరేగారు. రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. నరసింహకొండపై ఉన్న కూర్మావతార విగ్రహం వద్ద కూర్మ జయంతిని నిర్వహించారు. గరుడోత్సవానికి ఉభయకర్తలుగా ములుమూడికి చెందిన దశరథరామిరెడ్డి కుటుంబ సభ్యులు, కృష్ణకుమార్, మల్లికార్జున్‌యాదవ్, నరహరిరెడ్డి వ్యవహరించారు. రంగనాథ భక్తసేవా సమితి ఆధ్వర్యంలో రంగనాథస్వామి ఆలయం నుంచి నరసింహకొండకు నూతన గొడుగులను సమర్పించారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ పర్యవేక్షించారు.

కార్ల్ మార్క్స్‌కు నివాళి



నెల్లూరు (టౌన్): బాలాజీనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో కార్ల్ మార్క్స్ జయంతి వేడుకలను ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ, ఆవాజ్ నేతల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు, రమణ, నేతలు మస్తాన్, పద్మ, ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్, కోటేశ్వరరావు, ఎస్‌ఎఫ్‌ఐ నగర కార్యదర్శి నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్య ప్రదర్శన నేడు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): తాళ్లపాక అన్నమాచార్య జయంతిని పురస్కరించుకొని 70 మంది విద్యార్థులతో అన్నమయ్య, వాగ్గేయకార సంకీర్తన విభావరి, కూచిపూడి నృత్య ప్రదర్శనను నగరంలోని పురమందిరంలో శనివారం నిర్వహించనున్నామని త్యాగరాజ సాంస్కృతిక సభ అధ్యక్షురాలు లక్ష్మీ ప్రసన్న పేర్కొన్నారు. అత్తితోట అగ్రహారంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడారు. భారతి సంగీత విద్యాలయ అధ్యక్షురాలు రమాదేవి, గురుత్యాగరాజ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షురాలు వైష్ణవి, రాజరాజేశ్వరి నృత్యనికేతన్ నిర్వాహకులు విదుమౌళి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కళాకారులు, కళాభిమానులు తరలిరావాలని కోరారు. బెనర్జీ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌతమ బుద్ధుడి జయంతి



నెల్లూరు(బృందావనం): నగరంలోని స్వతంత్ర పార్కులో గౌతమ బుద్ధ జయంతిని శుక్రవారం నిర్వహించారు. పార్కులోని గౌతమ బుద్ధుడి విగ్రహానికి గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాయప్ప ఆధ్వర్యంలో పుష్పాంజలి సమర్పించారు. అనంతరం వాకర్స్ శ్రీనివాసులు, మధు, తదితరులను సత్కరించారు. అభ్యుదయ గీతాలను శ్రీనివాసులు, రంగ మిత్ర బృంద ఆధ్వర్యంలో ఆలపించారు. వైద్యులు రాజు, రమేష్, రమణయ్య, వాకర్స్ డిస్ట్రిక్ట్ కేబినెట్ ట్రెజరర్ శ్రీమన్నారాయణ, మురళీ మోహన్‌రావు, సత్యం, దశయ్య, సుబ్బారెడ్డి, ప్రసాద్, జనార్దన్, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

– గౌతమ బుద్ధుడికి సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో నివాళులర్పించారు. వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణ, కేశవులు, జయప్రకాష్, రమాదేవి, సుబ్రహ్మణ్యం, సత్యం, శ్రీనివాసులు, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

గంజాయి విక్రయాలపై దాడులు



నెల్లూరు(క్రైమ్): నగరంలో గంజాయి విక్రయాలపై ఎస్‌ఈబీ అధికారులు శుక్రవారం దాడులు చేసి ఐదుగుర్ని అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఎస్‌ఈబీ నెల్లూరు –1 స్టేషన్లో స్థానిక ఇన్‌స్పెక్టర్ కిశోర్ వెల్లడించారు. కపాడిపాళెంలో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయని సమాచారం అందడంతో నిఘా ఉంచారు. పక్కా సమాచారంతో కపాడిపాళెంలోని రాయపువారి వీధిలో దాడులు చేశారు. గంజాయి విక్రయదారులైన వెంగళరావునగర్‌కు చెందిన తిరుమల, కోడూరుపాడుకు చెందిన ఓ్రమేష్ అలియాస్ చిన్నా, సుభానీ, వినియోగదారులైన నెల్లూరు రూరల్ మండలం దొరతోపు కాలనీకి చెందిన రవితేజ అలియాస్ సాయి, సంజయ్‌ను అరెస్ట్ చేశారు. వీరి నుంచి రెండు కిలోల గంజాయి,ఐదు సెల్‌ఫోన్లు, కేటీఎం డ్యూక్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన గంజాయి సరఫరాదారుడ్ని అరెస్ట్ చేయాల్సి ఉందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

గుర్తుతెలియని యువకుడి మృతి



నెల్లూరు(క్రైమ్): గుర్తుతెలియని యువకుడు మృతి చెందిన ఘటన వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్ సమీపంలోని రైలు పట్టాల వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. మృతుడు 35 నుంచి 40 ఏళ్లలోపు వయస్సు కలిగి, బ్లూ రంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, బ్లూ నైట్ ప్యాంట్‌ను ధరించి ఉన్నారు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై హరిచందన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఎలాంటి వివరాలు లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆమె కోరారు.

పోక్సో కేసులో విచారణ

నెల్లూరు(క్రైమ్): వైఎస్సార్‌నగర్‌లో ముగ్గురు బాలికలపై వికృత చేష్టలకు పాల్పడిన ఇద్దరిపై పోక్సో కేసును వేదాయపాళెం పోలీసులు నమోదు చేశారు. ఘటనపై ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసులో విచారణను త్వరితగతిన పూర్తి చేసి నిందితులను అరెస్ట్ చేయాలని దిశ డీఎస్పీ సురేష్‌బాబును ఆదేశించారు. దీంతో ఘటన స్థలం, బాధితుల ఇళ్ల వద్ద డీఎస్పీ విచారణ చేపట్టారు. స్థానికుల నుంచి వివరాలను సేకరించారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



నెల్లూరు(బృందావనం): వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీ హోమాన్ని సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. ఉభయకర్తలుగా సత్యనారాయణ దంపతులు వ్యవహరించారు. మఠం నిర్వాహకులు నందకిషోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

వేడుకగా సత్యనారాయణ వ్రతం



నెల్లూరు(బృందావనం): వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని వేదాయపాళెంలోని కృష్ణ మందిరంలో సత్యనారాయణవ్రతాన్ని సామూహికంగా శుక్రవారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో చేపట్టారు. విజయకుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, మాలకొండయ్య, వేణుబాబు, సుబ్బరామరాజు, రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకూర్మ జయంతి



నెల్లూరు(బృందావనం): వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని సుజాతమ్మ కాలనీలోని కృష్ణ యోగ మందిరంలో కృష్ణ పరమాత్ముడు శ్రీకూర్మావతార అలంకారంలో శుక్రవారం దర్శనమిచ్చారు. మందిర మేనేజింగ్ ట్రస్టీ సర్వేపల్లి అజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా కాశీ విశ్వనాథుడి కల్యాణం



నెల్లూరు(బృందావనం): ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వనాథస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా శుక్రవారం నిర్వహించారు. ఆలయ అర్చకులు విశ్వనాథ గురుకుల్, గణేష్ గురుకుల్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయకర్తలుగా రాఘవేంద్రరావు, గిరిజ దంపతులు వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని శనివారం ఉదయం 8.30కు నిర్వహించనున్నారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ వెంకటరమణకుమార్, ఈఓ దర్గయ్య, తదితరులు పర్యవేక్షించారు.

ముత్తుమారియమ్మ ఆలయంలో పూజలు



నెల్లూరు రూరల్: కొత్తూరులోని ముత్తుమారియమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో ప్రత్యేక పూజలను ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం నిర్వహించారు. ఎంపీని ఆలయ కమిటీ సాదరంగా ఆహ్వానించింది.

రోడ్ల మరమ్మతు పనులను ప్రారంభించాలి



సమస్యలను పరిశీలిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): వర్షాల కారణంగా నగరపాలక సంస్థ పరిధిలోని రూరల్ ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు పనులను వెంటనే ప్రారంభించాలని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. 18వ డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీకాలని, సర్వేపల్లి కాలువ, తదితర ప్రాంతాల్లో కమిషనర్ వికాస్ మర్మత్‌తో కలిసి శుక్రవారం పర్యటించిన ఎంపీ మాట్లాడారు. స్థానిక సమస్యలపై కార్పొరేషన్ అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించేలా చూడాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం తగదన్నారు. మద్రిపాడు జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే భవన నిర్మాణాలు



భవనాన్ని పరిశీలిస్తున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): ప్రభుత్వ నిబంధనల మేరకే భవన నిర్మాణాలను చేపట్టాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. స్పందనలో వచ్చిన పలు ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో శుక్రవారం ఆయన పరిశీలించారు. మాగుంట లేఅవుట్లో నూతనంగా నిర్మిస్తున్న ఓ భవనాన్ని టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి సమర్పించిన ప్లాన్ మేరకే భవనాలను నిర్మించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ పరిధిలో భవన నిర్మాణాలను టౌన్‌ప్లానింగ్ అధికారులు నిరంతరం పరిశీలించాలని సూచించారు. టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించిన ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని, ఇవి పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. అనంతరం కోటమిట్టలో డ్రెయిన్ సమస్యను పరిశీలించారు.

విజయభాస్కర్ సేవలు అభినందనీయం



నెల్లూరు (అర్బన్): ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లా ఈఈగా పనిచేస్తూ బదిలీ అయిన విజయభాస్కర్ సేవలను ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మురళీకృష్ణ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ లక్ష్మీసునంద అభినందించారు. బదిలీపై ఒంగోలు వెళ్తున్న విజయభాస్కర్‌కు ఆత్మీయ వీడ్కోలు సభను పెద్దాస్పత్రి ఆవరణలోని ఏపీఎమ్మెస్‌ఐడీసీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. నూతన ఈఈ ఉమాశంకర్, డీఈ సాంబశివరావు, ఏఈ గోపీ, ఏపీఎమ్మెస్‌ఐడీసీ మేనేజర్, పెద్దాస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రమేష్‌బాబు, డాక్టర్ మస్తాన్‌బాషా, హెచ్‌డీఎస్ కమిటీ సభ్యుడు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం



నెల్లూరు (వేదాయపాళెం): కార్ల్ మార్క్స్ జయంతిని పురస్కరించుకొని సండే మార్కెట్ కమిటీ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. మార్కెట్ కమిటీ సభ్యులతో పాటు దాదాపు 60 మంది రక్తదానం చేశారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు హఫీజుద్దీన్, సెంథిల్‌కుమార్, రెడ్‌క్రాస్ రక్తదాన మోటివేటర్ మధుసూదన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ ప్రారంభం



నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల ఎదుట హార్ట్‌ఫుల్‌నెస్ ఆధ్యాత్మిక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్ షెల్టర్‌ను ప్రిన్సిపల్ గిరి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దాదాపు నాలుగు వేల మంది ఉన్న కళాశాల ఎదుట బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. ఆర్ అండ్ బీ ఎస్‌ఈ గంగాధర్, హార్ట్‌ఫుల్‌నెస్ పట్టణ కో ఆర్డినేటర్ వెంకటకృష్ణ, అధ్యాపకుడు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జీతాలిప్పించాలని వినతి



నెల్లూరు(అర్బన్): స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాల, సర్వజన ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటరీ, సెక్యూరిటీ సిబ్బందికి జీతాలను తక్షణమే చెల్లించేలా చర్యలు చేపట్టాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, సందానీబాషా కోరారు. ఈ మేరకు దర్గామిట్టలోని సర్వజన ఆస్పత్రి ఏడీ ఏడుకొండలుకు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. కాంట్రాక్ట్ దక్కించుకున్న ఏజెన్సీ సకాలంలో జీతాలిచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సెక్యూరిటీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శామ్యూల్, రామానుజులు, కార్యవర్గ సభ్యులు కుమార్, సురేష్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



నెల్లూరు(బారకాసు): పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మేయర్ స్రవంతి ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా 12వ డివిజన్ పరిధిలోని సాత్‌రాజుపాళెంలో శుక్రవారం పర్యటించిన ఆమె మాట్లాడారు. సైడ్ కాలువల్లో మురుగు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. పారిశుధ్యాన్ని మెరుగుపర్చే అంశంలో నిర్లక్ష్యం వహించొద్దని చెప్పారు. బహిరంగ ప్రదేశాలు.. కాలువల్లో చెత్త వేయకుండా వాహనాలకు అందించాలని కోరారు.

ముగిసిన శిక్షణ తరగతులు



నెల్లూరు(బారకాసు): కల్లూరుపల్లిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గల బేతెస్థ ప్రార్థన మందిరంలో వేసవి విరామ బైబిల్ పాఠశాల పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని పాస్టర్ సుదర్శనరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో దైవభక్తిని పెంపొందిస్తూ.. వారిలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు గానూ చిత్రలేఖనం, బొమ్మల తయారీ, తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చామని వివరించారు. యేసుక్రీస్తు గేయాలను విద్యార్థులు ఆలపించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు.